

వ్యవసాయ చెక్‌పోస్టుల వద్ద... తగ్గిన ఆదాయం! - 8లో

వ్యవసాయ చెక్‌పోస్టుల ద్వారా మార్కెట్ కమిటీకి వచ్చే ఆదాయం తగ్గింది. దీని వల్ల మార్కెట్ కమిటీల ఆదాయానికి గండి పడింది.



జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీనివ్వాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కిశోర్ కోరారు. - 8లో



108 అంబులెన్స్ సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి

108 అంబులెన్స్ సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ డిమాండ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

మూడు కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని మూడుకిలోల గంజాయిని వన్‌టౌన్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నట్టు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు రైల్వేస్టేషన్ సమీపంలో వన్‌టౌన్ ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో నిఘా పెట్టారు. తమిళనాడు రాష్ట్రం తిరువేలూరు జిల్లా అంబత్తూర్‌కి చెందిన ఎస్.శ్రీను గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. బరంపురం రైల్వేస్టేషన్ వద్ద గాయత్రీ అనే మహిళ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్టు తెలిపాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

హరిత ప్రాంగణంగా జేఎన్‌టీయూ జీవీ



మొక్కను నాటుతున్న సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్ రాజు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీని హరిత ప్రాంగణంగా తీర్చిదిద్దాలని సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్, ఏయూ మాజీ వీసీ డాక్టర్ జీఎస్ఎన్‌రాజు పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జరిగిన రీసెర్చ్ అడ్వైజర్ కమిటీ సమావేశంలో భాగంగా ఆయన యూనివర్సిటీని సందర్శించారు. వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకున్నారు. తొలుత గ్రీన్ క్లబ్ నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నతిలో గురువు పాత్ర కీలకం

- ఆర్‌జేడీ కె.విజయభాస్కర్



హెచ్‌ఎంల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

గజపతినగరం: విద్యార్థుల ఉన్నతిలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల పాత్ర కీలకమని ఆర్‌జేడీ కె.విజయభాస్కర్ అన్నారు. గజపతినగరం మండలం మరుపల్లి పాలిటెక్నికల్ కళాశాలలో శనివారం జరిగిన ఉమ్మడి విజయనగరం జిల్లాల పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓల శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందేలా బోధన సాగించాలన్నారు. నవ సమాజ నిర్మాణానికి బాటలు వేయాలన్నారు. ముందుగా మరుపల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో డీఈఓ మాణిక్యం నాయుడు, ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ పాల్గొన్నారు.

దళారులకు పత్తిని విక్రయించొద్దు

సాక్షి ఎఫెక్ట్...

రాజాం: పత్తి రైతులు దళారులకు పంటను విక్రయించి నష్టపోవద్దని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ బి.రవికిరణ్ సూచించారు. పత్తి పంట విక్రయానికి కొనుగోలు కేంద్రాలు లేవన్న అంశంపై 'పత్తి రైతుకు దళారులే దిక్కు' అనే శీర్షికతో 'సాక్షి'లో శనివారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. మార్కెట్ యార్డుల వద్ద ప్రారంభించే కొనుగోలు కేంద్రాల సమాచారం సేకరించామని, రైతులకు మద్దతు ధర లభించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. జిల్లాలో కాటన్ కార్పొరేషన్ రవాణా టెండర్లు ఖరారు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రామభద్రపురం మండలం ముచ్చెర్లవలసలోని పత్తికొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

అది ప్రభుత్వ హత్యే..

ఎన్నికల సమయంలో వలంటీర్లకు గుర్తింపు, గౌరవం కల్పిస్తామని, నెలకు రూ.10వేలు వేతనం చెల్లిస్తామని చెప్పిన టీడీపీ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చారు.. వలంటీర్ వ్యవస్థే లేదని అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పారు... దీనికి కలత చెందిన అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం మండలం, గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని నేలజర్రికి చెందిన కాకూరి వరలక్ష్మి ప్రాణాలు తీసుకుంది.. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ధ్వజమెత్తారు. ఆమెకు కన్నీటి నివాళులర్పిస్తూ విజయనగరం ఏపీ గ్రామ/వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో గంటస్తంభం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం, స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ సమీపంలో ఉన్న గాంధీవిగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వలంటీర్లకు ఇచ్చిన మాట నెలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ రవీంద్ర, కో కన్వీనర్లు ఆదిత్య, అచ్యుతకుమారి, బాలు, మణికంఠ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్ మృతికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

– విజయనగరం పూల్‌బాగ్

ఎరువుపై ధరల బాదుడు!



నాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) రైతులకు సౌకర్యంగా ఉండేవి. ఎరువు ఏది కావాలన్నా గ్రామాల్లోనే దొరికేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు అదీ ప్రభుత్వం నిర్దేశించిన ధరకే లభించేది. ఎమ్మార్పీ కన్నా ఒక్క పైసా కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదు. ప్రైవేట్ దుకాణాల దోపిడీకి అడ్డుకట్ట ఉండేది.

నేడు: టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఖరీఫ్ సీజన్‌లోనే కాదు సీజన్ ముగింపునకు వచ్చినా రైతులకు ఎరువుల కోసం కష్టాలు తప్పట్లేదు. ఆర్‌బీకే పేరును ఆర్ఎస్‌కే అని మార్చడంపై పెట్టిన శ్రద్ధ... రైతులకు మెరుగైన సేవలు అందించడంలో కనిపించలేదు. ఆర్ఎస్‌కేల్లో ఎరువులే కనిపించట్లేదు. రైతులకు మళ్లీ గత టీడీపీ పరిపాలనలో మాదిరిగానే ప్రైవేట్ ఎరువుల దుకాణాలదే హవా. ఎమ్మార్పీ గాకుండా వ్యాపారులు చెప్పిన ధరకే కొనుక్కోవాలి. లేదంటే వెనక్కి తిరిగిపోవాల్సిందే. పంటలను కాపాడుకోవడానికి వేరే గత్యంతరం లేక వారు ఎంత బాదినా భరిస్తున్నారు.


- ఖరీఫ్ ముగింపునకు వచ్చినా రైతును వీడని ఎరువు కష్టాలు
- మొక్కజొన్న, కూరగాయల సాగులో అదనపు భారం
- యూరియా, డీఏపీ ఎరువులపై ఎమ్మార్పీ కన్నా ఎక్కువ వసూలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఖరీఫ్ సీజన్ ముగింపునకు వచ్చింది. వరి పంట దాదాపుగా చాలా ప్రాంతాల్లో రైతుల చేతికి వచ్చింది. ఇక చెరకు, మొక్కజొన్న, పత్తి, గోగు, కూరగాయలతో పాటు ఉద్యాన పంటలు విజయనగరం జిల్లాలో దాదాపు 16,613 హెక్టార్లలో, పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు పది వేల హెక్టార్లలో సాగవుతున్నాయి. ఇప్పుడు డీఏపీ, యూరియా అవసరం. వాటి కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల (రైతు సేవా కేంద్రాల)కు వెళ్తే తెల్ల ముఖం వేయాల్సి వస్తోంది. ప్రైవేట్ ఎరువుల వ్యాపారుల దగ్గర మాత్రం పుష్కలంగా నిల్వలు ఉంటున్నాయి. కొనాలంటే బాదుడు తప్పట్లేదు. రెండు జిల్లాల్లో ప్రైవేట్ ఎరువుల దుకాణాలు దాదాపు 300 వరకూ ఉన్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచీ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. డీఏపీ బస్తా ఖరీదు రూ.1350 అయితే, దానికి అదనంగా గుళికల కోసం మరో రూ.500 చొప్పున ఇటీవల వరకూ రైతుల జేబుకు చిల్లుపెట్టేవారు. ఇప్పుడు రూ.1400 నుంచి రూ.1800 వరకూ వసూలు చేస్తున్నారు. ఒక్కో యూరియా బస్తా ఎమ్మార్పీ రూ. 270 అయితే అదనంగా రైతులు చెల్లించాల్సి వస్తోంది. డిమాండ్‌ను బట్టి రూ.300 నుంచి రూ.340 వరకూ కొందరు వ్యాపారులు ముక్కుపిండి వసూలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. పాటాష్, ఇతర కాంప్లెక్స్ ఎరువులపైనా రూ.50 వరకూ అదనంగా బాదేస్తున్నారు. అసలే పెట్టుబడి పెరిగిపోయి మరోవైపు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందక ఇబ్బంది పడుతున్న రైతులకు ఎరువు కష్టాలు తప్పట్లేదు.

దోపిడీ సాగుతోందిలా...

- రాజాం నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు పూర్తిగా కనుమరుగయ్యాయి. గతంలో ఈ కేంద్రాల్లో కియోస్కో యంత్రాలు ద్వారా రైతులు ముందుగా నమోదు చేసుకుంటే చెంతనే సకాలంలో పొందేవారు. ప్రస్తుతం ఈ సేవలు ఆగిపోయాయి. రాజాం పట్టణంలో ఎరువుల దుకాణాల వ్యాపారులు సిండికేట్ అయ్యారు. పురుగుమందులు, ఎరువులు ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారన్నది రైతుల మాట. పాలకులు, అధికారులు ఎవరూ రైతుల కష్టాలను పట్టించుకోవట్లేదు. గతంలో పాలకొండ రోడ్డులోని ఓ ఎరువుల దుకాణం నిర్వాహకులకు ఉన్నతాధికారుల నుంచి నోటీసులు జారీ అయినా స్థానిక వ్యవసాయశాఖ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి.
- విజయనగరం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే రూరల్ మండలంలోని ఎరువుల దుకాణాలు ఉన్నాయి. 14 ఆర్ఎస్‌కేలు ఉన్నా మూడు చోట్ల మాత్రమే అదీ అరకొరగా స్టాక్ ఉంది. కియోస్కో యంత్రాలను పూర్తిగా పక్కనబెట్టేశారు. ఎరువుల దుకాణాల వ్యాపారులు సిండికేట్‌గా మారి ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేస్తున్నట్టు వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా మార్పు కనిపించట్లేదు. కనీసం దుకాణాల వద్ద నోటీసు బోర్డులో ఎరువుల స్టాక్, ధరల వివరాలు ఎక్కడా కనిపించట్లేదు.
- బొబ్బిలి నియోజకవర్గంలో యూరియా రూ.267 బస్తాను రూ.320 నుంచి రూ.340 వరకూ విక్రయిస్తున్నారు. డీఏపీ బస్తా ఎమ్మార్పీ రూ.1350 కాగా రూ.50 అదనంగా బాదేస్తున్నారు. పొటాష్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు కూడా బస్తా వద్ద రూ.30 నుంచి రూ.60 అదనంగా వసూలు చేస్తున్నారు.
- కురుపాం నియోజకవర్గంలోని కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని రైతు సేవా కేంద్రాలో ఎరువులు అందుబాటులో లేవు. ప్రస్తుతం పంటలకు అవసరమైన డీఏపీ కోసం రైతులు దుకాణాలపైనే ఆధారపడుతున్నారు. ఒక్కో బస్తా రూ.1500 నుంచి రూ.1600 వరకు పెట్టి కొనుగోలు చేస్తున్నారు.
- పాలకొండ నియోజకవర్గంలో కూరగాయల సాగు చేస్తున్న రైతులు ముఖ్యంగా వీరఘట్టం, భామిని మండలాల్లో యూరియా బస్తాపై రూ.100 వరకూ అదనంగా చెల్లించి ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.



విజయనగరం రూరల్‌లో ఓ ఎరువుల దుకాణం వద్ద ధరల ప్రదర్శన పరిస్థితి ఇదీ...

రోడ్డున పడేసిన రక్తసంబంధం



బయటకు విసిరేసిన సామగ్రితో ఇంటి ముందే దీనంగా కూర్చున్న బాధిత కుటుంబం (ఇన్‌సెట్లో) తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న మంజు

- తండ్రితో కలిసి ఇద్దరు సోదరుల దుశ్చర్య!
- మరో సోదరుడి కుటుంబాన్ని రోడ్డుపైకి గెంటివేత
- దుస్తులు, సామగ్రిని బయటకు విసిరేసిన వైనం
- పిల్లలతో కలిసి గజగజ వణికిస్తున్న చలిలో 15 రోజులుగా రోడ్డుపైనే నివాసం
- న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమంటున్న కుటుంబం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా న్యాయం జరగలేదంటూ ఆవేదన
- కేసు నమోదు చేశాం: ఎస్ఐ దామోదరరావు

చీపురుపల్లి: అండగా నిలవాల్సిన అన్నదమ్ములు శత్రువుల్లా మారారు.. అక్కున చేర్చుకోవాల్సిన కన్నతండ్రి కనికరించలేదు.. ఇద్దరు అన్నదమ్ములు తండ్రితో కలిసి రక్తం పంచుకుపుట్టిన మరో సోదరుడి కుటుంబంపై పగబట్టారు. అర్ధరాత్రి సమయంలో ఆ కుటుంబాన్ని ఇంటి నుంచి గెంటేశారు. వారికి సంబంధించిన బట్టలు, సామగ్రి, పిల్లల పుస్తకాలను రోడ్డుపైకి విసిరేశారు. ముక్కుపచ్చలారని ఇద్దరు పిల్లలతో సహా ఆ భార్యాభర్తలు రోడ్డున పడ్డారు. తలదాచుకునేందుకు మరో ఇల్లులేక పిల్లలతో సహా రోడ్డుపైనే కాలంగడుపుతున్నారు. గ్రామస్తులు అందజేసిన ఆహారం తింటూ న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని పోలీసులు దృష్టికి తీసుకెళ్లినా పదిహేను రోజులుగా ఎలాంటి న్యాయ సహాయం అందలేదంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చీపురుపల్లి మండలం నిమ్మలవలస గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి బాధిత దంపతులు కోడిగుడ్ల బాలకృష్ణ, మంజుల ఆవేదన వారి మాటల్లోనే...

నిమ్మలవలస గ్రామానికి చెందిన కోడిగుడ్ల మహేష్‌కు రాజ్‌కుమార్, బాలకృష్ణ, శ్యామ్ అనే ముగ్గురు కొడుకులం. అందులో రెండో వాడిని నేను. భార్య మంజు, ఇద్దరు పిల్లలతో కలిసి చాలా కాలంగా విశాఖపట్టణంలో నివసిస్తూ ఆరు నెలల కిందటే సొంతూరు నిమ్మలవలస వచ్చాం. ఇక్కడ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. మా కుటుంబం అంటే తండ్రికి నచ్చదు. పెద్ద ఇల్లు ఉన్నా వంట ఇంటిని మాకు కేటాయించారు. అందులోనే భార్య, పిల్లలతో కలిసి సర్దుకుపోతున్నాం. అయినా సరే తండ్రి మద్యం మత్తులో వచ్చి నిత్యం వేధిస్తున్నారు. కుటుంబాన్ని దూషిస్తున్నారు. 15 రోజుల కిందట అర్ధరాత్రి సమయంలో ఇద్దరు సోదరుల సహాయంతో తమ కుటుంబాన్ని రోడ్డుపైకి గెంటేశారు. బట్టలు, సామాన్లు విసిరేసి, పిల్లలతో సహా తమను రోడ్డుపైకి తోసేశారు. అప్పటి నుంచి రోడ్డుపైనే ఉంటూ స్థానికులు ఇచ్చే ఆహారంతో జీవనం సాగిస్తున్నాం. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు వచ్చి చూసి వెళ్లారు. ఎలాంటి న్యాయం జరగలేదు. చలిలో పిల్లలతో కలిసి రోడ్డుపై జీవిస్తున్నా... న్యాయం చేయాల్సిన పోలీసులు ఎందుకు పట్టించుకోవడంలేదో అర్థం కావడం లేదు. తమకు న్యాయం చేయకుంటే పిల్లలతో కలిసి ఆత్మహత్యే శరణ్యమంటూ బాలకృష్ణ, మంజు దంపతులు బోరున విలపించారు.

కేసు నమోదు చేశాం..

నిమ్మలవలస గ్రామానికి చెందిన కోడిగుడ్ల మంజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. మంజు, బాలకృష్ణ కుటుంబాన్ని ఇంటి నుంచి వెల్లగొట్టిన ఫిర్యాదులో కోడిగుడ్ల మహేష్, రాజ్‌కుమార్, శ్యామ్‌లపై కేసు నమోదు చేశాం.

– ఎల్.దామోదరరావు, ఎస్ఐ, చీపురుపల్లి

ధైర్యంగా ముందుకు సాగేవారికి విజయం సొంతం

- జిల్లా జడ్జి సాయి కళ్యాణ్ చక్రవర్తి




మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాయి కళ్యాణ్ చక్రవర్తి

విజయనగరం అర్బన్:

అనుకున్న రంగంలో విజయం సాధించాలంటే దృఢసంకల్పం, అంకితభావం, క్రమశిక్షణ అవసరమని జిల్లా జడ్జి సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. మనలో ఈ మూడు అంశాలు ఉన్నప్పటికీ ఎన్నో అవరోధాలు, ఆటంకాలు ఎదురవుతుంటాయని, వాటిని ధైర్యంతో ఎదిరించి నిలిచేవాడే జీవితంలో విజేతగా నిలుస్తాడని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆనందగజపతి ఆడిటోరియంలో 'సామాజిక అవగాహన-జీవన నైపుణ్యాలు' అనే అంశంపై విద్యార్థులకు శనివారం ఒక రోజు నిర్వహించిన శిక్షణ తరగతిలో ఆయన మాట్లాడారు. విజయం అంటే ఉద్యోగం సాధించడమే కాదని, జీవితంలో విజయం అనేది ఏ రూపంలో అయినా సాధించవచ్చన్నారు. లక్ష్యసాధనలో ఓర్పు, సహనంతో పాటు మనం కచ్చితంగా సాధించగలమని మనపై మనకు నమ్మకం ఉండాలన్నారు. జిల్లా అదనపు జడ్జి కె.నాగమణి మాట్లాడుతూ పిల్లలకు ముందుగా తప్పొప్పులు నేర్పించేది తల్లిదండ్రులని, పిల్లలు చిన్న వయసులో తెలియక తప్పుచేస్తే అది తప్పు అని ముందుగా మందలించేది కూడా వారేనని అన్నారు. ఆ బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తే పిల్లలు జీవితంలో ఎదుగుతారన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కలలు కనాలి అనేవారని, ఆ కలల్లో పెద్ద కలలుగా ఐఏఎస్, ఐపీఎస్ వంటివి సాధించాలని అనుకుంటే గ్రూప్-1, 2 వంటి కలనైనా సాధించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథమే లక్ష్యంగా ఆవిర్భవించిన జనవిజ్ఞాన వేదిక విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పిస్తోందన్నారు. వేదిక రాష్ట్ర నాయకుడు రమేష్ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, డాక్టర్ ఎంవీఎస్ వెంకటరావు, గిరిజన యూనివర్సిటీ ఏఓ డాక్టర్ ఎస్.వి.సూర్యనారాయణ, సమతా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సుజాత, గండ్రేటి లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, గండ్రేటి శ్రీనివాసరావు, పట్టణ శాఖ అధ్యక్షుడు షిణగం శివాజీ, ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న డీఈఓ యు.మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: స్థానిక మున్సిపల్ కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో 'చెత్త నుండి సంపద' అనే అంశంపై పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ జిల్లా కమిటీ శనివారం నిర్వహించిన చిత్రలేఖన ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు తాము తయారుచేసిన పర్యావరణ హితవస్తువులను ప్రదర్శించారు. 'వాతావరణ కాలుష్యం' అనే అంశంపై విద్యార్థులు చిత్రించిన చిత్రలేఖనాలు, స్పాట్ పెయింట్స్ ఆలోచింపజేశాయి. ఈ ప్రదర్శనలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలను డీఈఓ యు.మాణిక్యంనాయుడు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీసీ కో ఆర్డినేటర్ వేణుగోపాలరావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు వి.సత్యారావు, పి.సత్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమంగా ఎంపికైన స్పాట్ పెయింటింగ్స్

మూడు రోజుల్లో వినతులు పరిష్కరించాలి

- తహసీల్దార్, సర్వేయర్లకు కలెక్టర్ ఆదేశాలు

విజయనగరం అర్బన్: జిల్లాలో భూముల రీ సర్వేపై ప్రజల నుంచి గ్రామ సభల ద్వారా వచ్చిన వినతులను మూడు రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు భూ సర్వేకు సంబంధించి నిర్వహించిన గ్రామసభల సమాచారాన్ని తక్షణమే అందజేయాలని చెప్పారు. జిల్లాలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. గ్రామ సభల్లో వచ్చిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. జిల్లాలో గతంలో భూసర్వే నిర్వహించిన గ్రామాల్లో 502 గ్రామసభలు నిర్వహించగా భూ సమస్యలపై 25,222 దరఖాస్తులు అందాయన్నారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 13,496, సర్వే విభాగానికి చెందినవి 11,726గా చూపిస్తున్నారని, వీటన్నింటినీ బుధవారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు స్వయంగా వినతుల పరిష్కారంపై పర్యవేక్షణ చేసి త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, సర్వే భూ రికార్డుల విభాగం ఏడీ రమణమూర్తి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

ఫీజుల కోసం ఒత్తిడి చేస్తే చర్యలు తప్పవు

ఫీజుల చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు హాల్ టికెట్లు నిరాకరించడం, తరగతులకు హాజరు కాకుండా అడ్డుకోవడం, ప్రాక్టికల్స్‌కు నిరాకరించడం వంటి చర్యలకు పాల్పడే ప్రైవేటు కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్య ప్రతినిధులతో కలెక్టర్ శనివారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కళాశాలల బ్యాంకు ఖాతాలకే జమచేస్తుందన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా మోహన్‌రావు



ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఎంపికైన బండారు మోహన్‌రావు

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బండారు మోహన్‌రావు రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్టు హెచ్‌ఎం చీపురపల్లి ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం అందుకుంటారన్నారు. మోహన్‌రావును పలువురు అభినందించారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఏకలవ్య పాఠశాల విద్యార్థినిలు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిలతో ప్రిన్సిపాల్ తదితరులు

సాలూరు: జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పాచిపెంట మండలంలోని కొటికిపెంట ఏకలవ్య పాఠశాల నుంచి 12 మంది విద్యార్థినిలు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ దేవేందర్‌సింగ్ శనివారం తెలిపారు. ఈ నెల 20, 21, 22న అనంతగిరిలోని ఏకలవ్య పాఠశాలలో 4వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరగ్గా ఈ పోటీల్లో 28 ఏకలవ్య పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్ తదితర విభాగాల్లో 6 గోల్డ్, 6 సిల్వర్, చాంపియన్ ట్రోఫీ గెలుపొందారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిలను ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పూరిపాక దగ్ధం



కాలిపోయిన పాకను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

భామిని: చలి తీవ్రత నుంచి రక్షణకు వేసిన చలి మంటతో జరిగిన అగ్ని ప్రమాదం నుంచి వృద్ధ దంపతులు త్రుటిలో తప్పించుకొని ప్రాణాలతో బయటపడ్డారు. పూరిపాక కాలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. భామిని మండలం కోసలిలో కుప్పిలి రామయ్య, రవణమ్మ వృద్ధ దంపతులు. వీరు నివసిస్తున్న పూరిపాక శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. అదే సమయంలో పాకలో నిద్రిస్తున్న వృద్ధులు అప్రమత్తమై బయటపడ్డారు. రాత్రి వేసిన చలిమంట ప్రమాదానికి కారణంగా గ్రామస్తులు తెలిపారు. ఎంఆర్ఐ కొట్టుగుమ్మడి కృష్ణారావు, వీఆర్‌ఓ బిడ్డికి గోపాల్ ప్రమాద స్థలాన్ని సందర్శించి కారణాలు తెలుసుకున్నారు. నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు.

ఇద్దరు మైనర్లపై కేసు నమోదు

సంతకవిటి: ఇద్దరు మైనర్లపై కేసు నమోదు చేసి శ్రీకాకుళంలోని జువైనల్ కోర్టులో శనివారం హాజరుపరచినట్లు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కుతీబస్ నాయక్ రాజాంలోని ఓ జ్యూట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఈయన గురువారం రాత్రి 11 గంటల సమయంలో రాజాం బస్టాండ్‌లో బస్ దిగి డోలపేట వైపు నడుచుకుంటూ వస్తుండగా ఇద్దరు వ్యక్తులు అడ్డగించి తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్, 1500 రూపాయలను తీసుకుని పరారైనట్టు శనివారం సంతకవిటి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. సీసీ పుటేజ్‌ల ఆధారంగా 24 గంటల్లోనే ముద్దాయిలను పట్టుకున్నామని తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య



మృతురాలు గౌరమ్మ

బాడంగి: మండలంలోని గొల్లలపేటకు చెందిన రాపాక గౌరమ్మ(55) అనే వృద్ధురాలు విజయనగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. తమ పంట కల్లంలో ఈ నెల 14న పురుగుల మందు తాగి గౌరమ్మ ఆత్మహత్యకు పాల్పడగా అపస్మారక స్థితికి చేరడంతో బంధువుల సహాయంతో స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వరుసకు సోదరుడైన రాపాక గౌరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తారకేశ్వరరావు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు తెలిపారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది - గొర్లెసీతారాంపురం గ్రామాల మధ్య రహదారిపై బొగ్గుల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. విశాఖపట్టణం నుంచి రాయపూర్ వెళ్తున్న ఈ లారీ గొర్లె సీతారాంపురం గ్రామ సమీపాన అదుపు తప్పి బోల్తా కొట్టి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి బోర్లా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ నరేంద్రపాటిల్, క్లీనర్ త్రిలోచన్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు లారీ లోపల నుంచి వీరిని బయటకు తీసి 108 వాహనం ద్వారా స్థానిక సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹244

వ్యవసాయ చెక్‌పోస్టుల వద్ద... తగ్గిన ఆదాయం!

వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టుల ద్వారా ప్రభుత్వానికి సమకూరాల్సిన ఆదాయం గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.లక్షల్లో తగ్గింది. దీంతో మార్కెట్ కమిటీలకు చేకూరాల్సిన ఆదాయం పడిపోయింది. జిల్లాలో 11 చెక్ పోస్టులు ఉండగా వాటి ద్వారా రావాల్సిన ఆదాయానికి రూ.లక్షల్లో గండిపడడం ఆ శాఖలో చర్చనీయాంశమైంది.

- జిల్లాలో 11 చెక్‌పోస్టులు
- 2023 - 24లో రూ.4.98 కోట్లు ఆదాయం
- 2024- 25లో అక్టోబర్ నెలకు లక్ష్యం రూ.2.88 కోట్లు
- వచ్చిన ఆదాయం రూ.2.22 కోట్లు
- 184 రకాల నోటిఫైడ్ ఉత్పత్తులపై ఒకశాతం మార్కెట్ ఫీజు వసూలు
- తగ్గిన రూ.66 లక్షల ఆదాయం



విజయనగరంలోని విశాఖ రోడ్డులో ఉన్న వ్యవసాయ చెక్‌పోస్టు

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ చెక్‌పోస్టుల ద్వారా మార్కెట్ కమిటీకి వచ్చే ఆదాయం తగ్గింది. దీని వల్ల మార్కెట్ కమిటీల ఆదాయానికి గండి పడింది. వ్యవసాయ ఉత్పత్తులకు విధించే మార్కెట్ ఫీజు ద్వారా మార్కెట్ కమిటీలకు ఆదాయం వస్తుంది. వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ ఫీజును వ్యవసాయ చెక్‌పోస్టు సిబ్బంది వసూలు చేస్తారు. జిల్లాలో సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల ద్వారా మార్కెట్ కమిటీలు ఫీజు వసూలు చేస్తారు. అయితే ఈ ఏడాది చెక్‌పోస్టుల ద్వారా వచ్చిన ఆదాయం తగ్గింది.

జిల్లాలో 11 వ్యవసాయ చెక్ పోస్టులు

జిల్లాలో 11 చెక్‌పోస్టులు ఉన్నాయి. విజయనగరంలో చెక్‌పోస్టు - 1, చెక్‌పోస్టు - 2 ఉన్నాయి. బొబ్బిలి, టెక్కలివలస, రామభద్రపురం,గొట్లాం, గరివిడి, కొత్తవలస, నాతవలస, గర్భాం, డోలపేట, రాజాంలోని చీపురపల్లి రోడ్డులో వ్యవసాయ చెక్‌పోస్టులు ఉన్నాయి.

తగ్గిన ఆదాయం రూ.66 లక్షలు

చెక్‌పోస్టుల ద్వారా మార్కెట్ కమిటీలకు వచ్చిన ఆదాయం రూ.66 లక్షలు తగ్గింది. 2023 - 24లో చెక్‌పోస్టుల రూ.4.98 కోట్లు ఆదాయం సమకూరింది. 2024 - 25లో చెక్‌పోస్టుల ద్వారా అక్టోబర్ నాటికి ఆదాయ లక్ష్యం రూ.2.88 కోట్లు కాగా.. వసూలు చేసింది రూ.2.22 కోట్లు మాత్రమే.

2024 - 25 అక్టోబర్ నాటికి చెక్‌పోస్టుల ఆదాయ లక్ష్యం, వసూలైన ఫీజు వివరాలు

చెక్‌పోస్టు	మార్కెట్ ఫీజు లక్ష్యం	వసూలైన ఫీజు
విజయనగరం-1	రూ.18.50 లక్షలు	రూ.11.14 లక్షలు
విజయనగరం-2	రూ.17.00 లక్షలు	రూ.9.31 లక్షలు
బొబ్బిలి	రూ.8.00 లక్షలు	రూ.8.83 లక్షలు
టెక్కలివలస	రూ.5.00 లక్షలు	రూ.4.90 లక్షలు
రామభద్రపురం	రూ.32.00 లక్షలు	రూ.31.88 లక్షలు
గొట్లాం	రూ.50.50లక్షలు	రూ.43.99 లక్షలు
గరివిడి	రూ.17.00 లక్షలు	రూ.16.41 లక్షలు
కొత్తవలస	రూ.21.50 లక్షలు	రూ.17.74 లక్షలు
నాతవలస	రూ.65.00 లక్షలు	రూ.42.09 లక్షలు
గర్భాం	రూ.14.00 లక్షలు	రూ.6.36 లక్షలు
డోలపేట	రూ.32.00 లక్షలు	రూ.23.31 లక్షలు
రాజాంచీపురుపల్లి రోడ్డు..	రూ.8.00 లక్షలు	రూ.6.60 లక్షలు

ఒక శాతం మార్కెట్ ఫీజు వసూలు

184 రకాల నోటిఫైడ్ వ్యవసాయ ఉత్పత్తులపై ఒక శాతం మార్కెట్ ఫీజు వసూలు చేస్తారు. వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వులు, పెసలు, మినుములు, గోగునార, బెల్లం, అరటి, వేరుశనగ, మామిడి, జీడిమామిడి తదితర ఉత్పత్తులపై మార్కెట్ ఫీజు వసూలు చేస్తారు.

ఆదాయం వచ్చే అవకాశం ఉంది..

జీడిపప్పు, కర్రలపై గతేడాది మార్కెట్ ఫీజు అధికంగా వచ్చింది. ఈ ఏడాది జీడిపప్పు ఉత్పత్తులు మార్కెట్‌లోకి రావడానికి ఇంకా సమయం ఉంది. ఆదాయం శతశాతం వచ్చే అవకాశం ఉంది.

– రవికిరణ్, మార్కెటింగ్ శాఖ ఏడీ

ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

మహారాణిపేట(విశాఖ)/ విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ప్రతిపాదిత ఓటర్ల జాబితాను శనివారం జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఈ నెల 6వ తేదీ వరకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొత్తం 17,404 మంది దరఖాస్తు చేశారు. ఆన్‌లైన్ ద్వారా 4,802 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 12,602 దరఖాస్తు చేశారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, మొత్తం 15,287 మందికి ఓటు హక్కు కల్పించారు. వీరిలో పురుషులు 9,638 మంది, స్త్రీలు 5,649 మంది ఉన్నారు. ఈ ముసాయిదాపై డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ప్రకటించిన ముసాయిదా జాబితాలో మార్పులు, చేర్పులకు వచ్చేనెల 9వ తేదీ వరకు టీటీటీ.ఛ్చ్చి ఛ్చీజిట్చ్చ. ఛ్జీఛి.జీ ఛ అనే వెబ్‌సైట్‌లో కాని, సంబంధిత ఓటర్ల నమోదు అధికారికిగాని, సహాయ ఓటరు నమోదు అధికారులు లేదా ప్రత్యేక అధికారులకు గాని దరఖాస్తులను సమర్పించవచ్చు. ప్రచురించిన ముసాయిదా జాబితాలో అర్హులైన వారి పేరు నమోదు కాకపోతే కనీసం మూడేళ్ల బోధన అనుభవం గల ధ్రువీకరణ పత్రంతో పాటు అన్ని డాక్యుమెంట్లతో ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యంతరాలను ఫారం-7 ద్వారా తెలియజేయాలి. జాబితాలో ఓటరు వివరాల మార్పుల కోసం ఫారం-8లో దరఖాస్తు చేయాలి. అభ్యంతరాల స్వీకరణపై విజయనగరం కలెక్టరేట్‌లో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గడువులోగా అభ్యంతరాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముసాయిదా జాబితాలో ఓటర్ల వివరాలు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
శ్రీకాకుళం	2,725	1,181	00	3,906
విజయనగరం	2,164	1,261	00	3,425
పార్వతీపురం మన్యం	1,267	595	00	1,862
అల్లూరి సీతారామరాజు	831	527	00	1,358
విశాఖపట్నం	1,426	1,421	00	2,847
అనకాపల్లి	1,225	664	00	1,889
మొత్తం	9,638	5,649	00	15,287

108 అంబులెన్స్ సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి

- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ

పార్వతీపురం టౌన్: 108 అంబులెన్స్ సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ డిమాండ్ చేసారు. పార్వతీపురం గిరిజన సామాజిక భవనంలో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడుజి కిషోర్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2005వ సంవత్సరం నుండి ప్రజలకు సేవలు అందిస్తున్న 108 వ్యవస్థ నిర్వహణను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వలన అంబులెన్స్ సేవల్లో నాణ్యత కొరవడిందన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, అంబులెన్స్‌లు అత్యవసర పరిస్థితులలో సకాలంలో చేరుకోక అనేకమంది అత్యవసర వైద్య సేవలు అందక మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్వహించాల్సిన 108 వ్యవస్థలో కార్పొరేట్ శక్తులు ప్రవేశించి తమ లాభాలను పెంచుకునేందుకు ఈ అంబులెన్స్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. 108 వ్యవస్థలో పని చేస్తున్న 3,500 మంది సిబ్బందికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు పరిహారం చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ 108 వ్యవస్థలో పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు గుంట్రెడ్డి రవికుమార్, జి.శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, సంచాన ఉమామహేశ్వరరావు, పి.సంఘం, మన్మథరావు, బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రమేష్, 104 ఉద్యోగ సంఘం నాయకుడు జి దుర్గారావు, చెరువుల పరిరక్షణ సమితి నాయకులు వంగల దాలినాయుడు, 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లి అప్పలనాయుడు, కార్యదర్శి తెర్లి వెంకటరమణ, తెంటు రాంబాబు, ఆవాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలనలో అధికారులు

సాక్షి ఎఫెక్ట్



గంట్యాడ మండలం పెదవేమలిలో రెల్లరాల్చు పురుగు ఆశించిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్త

విజయనగరం ఫోర్ట్: రెల్లరాల్చు పురుగు ఆశించడం వల్ల వరి పంట వెన్నులను పురుగు విరిచేయడంతో పంటకు నష్టం వాటిల్లుతుందనే అంశంపై సాక్షిలో శనివారం చి'వరి'లో తెగుళ్లదాడి అనే శీర్షికన ప్రచురించిన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. గంట్యాడ మండలం పెదవేమలిలో రైతు శిక్షణ కేంద్రం ఏడీ చంద్రశేఖర్‌బాబు, గాజులరేగలోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరావు, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌కుమార్ రెల్లరాల్చు పురుగు అశించిన వరి పంటను పరిశీలించారు. పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు వివరించారు. రెల్బరాల్చు పురుగు నివారణకు పొలంలో నీరు పెట్టి తీసివేసి వెంటనే క్లోరోఫైరిపాస్ మందు లీటరు నీటికి 2.5 ఎం.ఎల్ మందు కాని ఇమామెక్టిన్ బెంజాయింట్ 80 గ్రాములు కాని, పర్మెత్రిన్ మందు ఎకరానికి 200 లీటర్ల నీటిలో 400 ఎం.ఎల్ మందు పిచికారీ చేసుకోవాలన్నారు.

తక్షణమే వితంతు పింఛన్ మంజూరు : కలెక్టర్

పార్వతీపురం: ఎన్టీఆర్ భరోసా పింఛను పొందే వ్యక్తి మరణించిన సందర్భంలో వారి జీవిత భాగస్వామి (వితంతువు)కి కుటుంబ పోషణ కోసం తక్షణమే పింఛన్ పథకం కింద అర్హత మేరకు పింఛన్‌ను మంజూరు చేయబడుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారుడు 2024 నవంబర్ 1వ తేదీ లేదా ఆ తర్వాత మరణించినచో, వారి జీవిత భాగస్వామికి డిసెంబర్ 1వ తేదీ నుంచి పింఛను ప్రాసెస్ చేయబడుతుందన్నారు. ప్రతి నెలా పింఛన్లు పంపిణీ పూర్తయిన పిదప, పింఛను చెల్లించని పింఛనుదారుల రిమార్కును నమోదు చేయుటకు ప్రొవిజన్ మొబైల్ యాప్‌లో గ్రామ, వార్డు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంటు వారికి ఇవ్వబడుతుందన్నారు. పురుష పెన్షనర్ డెత్ రిమార్క్ నమోదు చేసేటప్పుడు, జీవిత భాగస్వామి వివరాలు, ఆధార్, ఫోను నంబర్లు, పంచాయతీ సెక్రటరీ లేదా వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ తీసుకొంటారన్నారు. పింఛన్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలైనా డీఆర్‌డీఏ పీడీ పరిశీలిస్తారని తెలిపారు.

29న ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 29న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ పురుషులు అర్హులని అన్నారు. ఏసీ ఫ్రిజ్ మెకానిక్ వర్క్స్ (75 రోజులు), ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ (30 రోజులు)లో పాటు శిక్షణ ఉంటుందని అన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో పాల్గొనాలని సూచించారు. శిక్షణా కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామని అన్నారు. వివరాలకు 90147 16255, 94917 41129, 98669 13371, 99899 953145 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు

- ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

పార్వతీపురం టౌన్: జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీనివ్వాలని ఏపీయూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు కిశోర్ కోరారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం బెలగాం రైతుబజార్ సమీపంలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తామన్నారు. సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఆశపు జయంత్‌కుమార్, సాలాపు అనంతరావు, జి.గోపాల్, పాణిగ్రాహి సత్యనారాయణ, ఆర్‌వీఎస్ కుమార్, ఆర్.సుధాకర్, కోమటి శ్రీనివాసరావు, బి.రాజశేఖర్, ఉమా మహేశ్వరరావు, భగవాన్ దాస్ ప్రశాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


అంకితభావంతో పని చేయండి : జేసీ



తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సర్వీసులపై ఆరా తీస్తున్న జేసీ శోభిక

సాలూరు: ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని జాయింట్ కలెక్టర్ శోభిక అన్నారు. పట్టణంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ సర్వీసులు ,శాఖాపరంగా జరుగుతున్న పనులపై ఆరా తీసారు. అనంతరం పట్టణంలో జీసీసీ గోదాంను పరిశీలించారు. సక్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. మండలంలో శివరాంపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసారు. ట్రక్ షీట్, రికార్డులు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ వెంకటరమణ, ఏఓ అనురాధ, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కొరియర్ పేరిట వచ్చే కాల్స్‌పై తస్మాత్.. : ఎస్పీ



సైబర్ నేరాల పట్ల అవగాహన పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ఇంటర్నేషనల్ కొరియర్ స్కామ్‌పై వచ్చే ఫోన్ కాల్స్ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరుతూ జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లు, వీడియోను ఎస్పీ వకుల్ జిందల్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ కొరియర్ పేరుతో సైబర్ మోసగాళ్లు ప్రజలకు ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ చేసి, మోసాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి వారిపట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ తరహా కాల్స్, వాట్సాప్ కాల్స్, వీడియో కాల్స్ లింక్స్‌తో సైబర్ మోసగాళ్లు ప్రజలకు ఉచ్చు వేస్తూ, వారిని భయపెట్టి, డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. సైబర్ మోసగాళ్లు ప్రజల మొబైల్స్‌కు ఫోన్ చేసి, తాము ఇంటర్నేషనల్ కొరియర్స్ నుంచి మాట్లాడుతున్నామని, మన చిరునామా, ఆధార్ నెంబర్ , ఫోన్ నెంబర్ వంటి కొంత సమాచారాన్ని ముందుగా మనకు తెలిపి, మన పేరుతో బుక్ చేసిన కొరియర్ పార్సిల్స్‌లో నిషేధిత మాదక ద్రవ్యాలు, అక్రమ వస్తువులు, ఫేక్ పాస్‌పోర్టు, బంగారం బిస్కెట్లు వంటివి ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలను ఇతర దేశాలకు పంపిస్తున్నారని నిర్ధారణ అయిందని, కేసు కూడా నమోదైందని, విచారణ నిమిత్తం తాము సూచించిన సుదూర ప్రాంతానికి దర్యాప్తు నిమిత్తం రావాల్సి ఉంటుందని భయభ్రాంతులకు గురి చేస్తారన్నారు. సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌ను క్లిక్ చేస్తే, తమ బ్యాంక్ సేవింగ్ ఖాతాల్లోని నగదు చోరీకి గురవుతుందన్నారు. కావున ప్రజలందరూ ఇటువంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఇంటర్నేషనల్ కొరియర్స్, ఫెడెక్స్, బ్లూడాట్ వంటి కొరియర్ సర్వీసులు, డిజిటల్ అరెస్ట్, బిట్ కాయిన్ పేరుతో వచ్చే నకిలీ కాల్స్‌ను, వీడియో కాల్స్‌ను నమ్మి, సైబర్ మోసాలకు గురికావద్దన్నారు. ఈ తరహా మోసగాళ్ల కాల్స్‌కు భయపడాల్సిన పని లేదని, ప్రజలెవ్వరూ స్పందించవద్దని ఆయా నెంబర్ నుంచి వచ్చే కాల్స్‌ను బ్లాక్ చేసి సమాచారాన్ని స్థానిక పోలీసుస్టేషన్‌కి అందించాలన్నారు. ఈ తరహా నేరాల్లో ఎవరైనా నగదును పోగొట్టుకున్నట్లయితే 1930కి లేదా నేషనల్ క్రైమ్ పోర్టల్‌లో రిపోర్టు చేయాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేసే విధంగా వీడియో రూపకల్పన చేసిన టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు, వీడియోగ్రాఫర్ జి.జగదీష్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్‌బీ సీఐ ఎవి.లీలారావు, టివిఆర్ కె.చౌదరి, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, సాంకేతిక సహాయాన్ని అందించిన బ్లర్ ఫొటో స్టూడియో వీడియోగ్రాఫర్ జి.జగదీష్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు



ప్రైవేటు ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియలో భాగంగా పార్వతీపురంలో అభయ క్లినిక్ - డయాగ్నోస్టిక్స్, వందన ఆస్పత్రులను వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు వైద్య బృందంతో కలిసి శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ మేరకు అమలు చేస్తున్నారో.. ప్రతీ విభాగాన్ని పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ, వైద్య పరికరాల పనితీరు, ఆస్పత్రుల ఆవరణలో పరిశుభ్రత, రోగుల చికిత్స నిమిత్తం అవసరమైన సదుపాయాలు, మౌలిక వసతుల కల్పన మొదలగు అంశాలన్నిటిపై తనిఖీ చేశారు. రిసెప్షన్ వద్ద రోగుల వివరాలు స్పష్టంగా పూర్తిగా నమోదు చేయాలన్నారు. వివిధ పరీక్షలు, తనిఖీల రుసుము(ఫీజు) వివరాలు తప్పనిసరిగా ఆస్పత్రిలో ప్రదర్శించాలన్నారు. బయోమెడికల్ వ్యర్థ పదార్థాల నిర్వహణ ఏ విధంగా అమలు చేస్తున్నారో ఆరా తీశారు. చేతుల పరిశుభ్రత తప్పనిసరి అని ఆదేశించారు. అగ్నిమాపక రక్షణ పరికరాల నిర్వహణ, వినియోగించే నైపుణ్యంపై సిబ్బంది అందరికీ అవగాహన కల్పించాలన్నారు.

నోటిఫైడ్ వ్యాధుల వివరాలు పోర్టల్‌లో నమోదు తప్పనిసరి

నోటిఫైడ్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, కుక్క కాటు, పాము కాటు వివరాలు నిర్దేశించిన హెచ్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు, సలహాలు తెలియజేసే పోస్టర్లను ఆస్పత్రిలో ప్రదర్శించాలన్నారు. ప్రసవ గదిలో పరికరాలు, స్టెరిలైజేషన్ నిర్వహణ, రేడియంట్ వార్మర్ పనితీరు పరిశీలించారు. శస్త్ర చికిత్సలు నిర్వహించే సమయంలో అనస్థీషియా వైద్యులు తప్పనిసరిగా ఉండాలన్నారు. వివిధ విభాగాల్లో ఉన్న సిబ్బంది నైపుణ్యత ప్రతిభను పరిశీలించారు.